ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రజానేస్తం జ్వాల దినపత్రికలో పనిచేయడానికి విలేకరులు కావలెను

రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో ప్రతినిధుల నియామకం

ప్రజాసేవ పట్ల ఆసక్తి, జర్నలిజం పట్ల మక్కువ ఉన్న సమర్థులైన వారు మా పత్రికతో పనిచేయడానికి సంప్రదించగలరు.


సంప్రదించవలసిన పేరు:
చెన్నగాని పురుషోత్తం
ఫోన్: 9603068864
www.prajanesthamjwalanews.com | epaper.prajanesthamjwalanews.com

నవంబర్ 18 బుధవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 39 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

WEDNESDAY NOVEMBER 18 2026 | VOL:1 | ISSUE: 39 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వండి: ఛత్తీస్‌గఢ్ సీఎంకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

- రాయ్‌పూర్‌లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కీలక భేటీ
- సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్ఓసీ మంజూరుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సానుకూల స్పందన
- తుపాకులగూడెం వద్ద ఇప్పటికే పూర్తయిన బ్యారేజీ నిర్మాణం
- నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాస నిధులు ఇచ్చేందుకు తెలంగాణ సిద్ధం



ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన బహుళ ప్రయోజనాల సమ్మక్క సాగర్ బ్యారేజీకి సంబంధించి వెంటనే నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీ చేయాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్ ప్రాజెక్టు సమగ్ర వివరాలను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి వివరించి, త్వరితగతిన ఎన్ఓసీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందిస్తూ, ఎన్ఓసీ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా

(మిగతా 2వ పేజీలో..)

పోటీ కాదు, సహకారమే మన భవిష్యత్తు: ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ


భారత్ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయన్న మోదీ

వికసిత భారత్ 2047, ఆసియాన్ విజన్ 2045 లక్ష్యాలు కీలకం

ప్రస్తుత ప్రపంచానికి శాంతి, స్థిరత్వం ఎంతో అవసరమని వ్యాఖ్య

భారత్ అభివృద్ధి, ఆసియాన్ దేశాల శ్రేయస్సు ఒకదానితో ఒకటి గాఢంగా ముడిపడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇరుపక్షాల భవిష్యత్తును పోటీతత్వం కాకుండా సహకారం నిర్దేశించాలని ఆయన పిలుపునిచ్చారు. మనీలాలో జరిగిన 23వ ఇండియా-ఆసియాన్ సదస్సులో మోదీ ప్రసంగించారు.భారత్, ఆసియాన్ దేశాలు కలిస్తే ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతు ఉంటాయని మోదీ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో

(మిగతా 2వ పేజీలో..)



కాంగ్రెస్ మేనిఫెస్టోకు మూడేళ్లు.. అభయహస్తం కాస్తా శూన్యహస్తమైంది: హరీశ్‌రావు

- కాంగ్రెస్ మేనిఫెస్టోను మోసాల చిట్టాగా అభివర్ణించిన హరీశ్‌రావు
- పవిత్ర గ్రంథాల మీద చేసిన ప్రమాణాలను గాలికొదిలేశారని విమర్శలు
- ఇచ్చిన హామీలపై రేవంత్ రెడ్డి, ఖర్గే సమాధానం చెప్పాలని డిమాండ్
- మోసపూరిత పాలనపై ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని వ్యాఖ్య

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సరిగ్గా మూడేళ్ల క్రితం విడుదల చేసిన మేనిఫెస్టోను మోసాల చిట్టాగా మార్చేశారని 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ప్రజలకు అండగా ఉంటామని చెప్పిన 'అభయహస్తం' కాస్తా, నేడు ప్రజలకు ఏమీ ఇవ్వని 'మొండిహస్తం', 'శూన్యహస్తం'గా మారిపోయిందని ఎద్దేవా చేశారు.మల్లికార్జున ఖర్గే సమక్షంలో మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలతో సమానంగా భావించి ప్రతి హామీని అమలు చేస్తామని నాడు రేవంత్ రెడ్డి ప్రమాణం చేశారని హరీశ్‌రావు అన్నారు. మూడేళ్లు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేరలేదని ఆరోపించారు. ఓట్లేసిన ప్రజలనే కాకుండా ప్రమాణం చేసిన పవిత్ర గ్రంథాలను కూడా కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. గాంధీభవన్‌లో ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోయారో రేవంత్ రెడ్డి, ఖర్గే, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తొలి మంత్రివర్గ సమావేశంలోనే 'ఆరు గ్యారెంటీ'లకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పటివరకు 38 క్యాబినెట్ భేటీలు నిర్వహించినా ఎందుకు ఆ పని చేయలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. హామీలను ఎగ్గొట్టి ప్రజలను వంచించడమే కాంగ్రెస్ ఏకైక విజయమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మోసపూరిత విధానాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం

ప్లాట్‌ఫారాలు 5, 6 మధ్య నిలిపి ఉంచిన ఖాళీ కోచ్‌లో చెలరేగిన మంటలు

సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ప్రమాదానికి గల కారణాలపై దక్షిణ మధ్య రైల్వే దర్యాప్తు

హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో సోమవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్టేషన్‌లోని 5, 6 నంబర్ ప్లాట్‌ఫారాల మధ్య ట్రాక్‌పై నిలిపి ఉంచిన ఒక ఖాళీ రైలు బోగీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఆ బోగీలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ముప్పు తప్పింది.సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో రైలు బోగీ నుంచి దట్టమైన పొగలు, మంటలు ఎగసిపడటాన్ని గుర్తించిన స్టేషన్



తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే.. ఆత్మకథలో ఎందుకు రాయలేదు?: కేటీఆర్

సోనియా ఆత్మకథలో తెలంగాణ ఏర్పాటు ప్రస్తావన లేదన్న కేటీఆర్

తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే అయితే సమాధానం చెప్పాలని డిమాండ్

ఉద్యమ కాలం నాటి పాదయాత్రను గుర్తు చేసుకుంటూ పోస్ట్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని లక్ష్యంగా చేసుకుని సూటి ప్రశ్న సంధించారు. సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉంటే, ఆమె రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆత్మకథలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రస్తావన ఎందుకు లేదని నిలదీశారు. 'తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే' అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ దయాభిక్ష కాదని, అది తెలంగాణ ప్రజల పోరాట ఫలితమని కేటీఆర్ స్పష్టం చేశారు. తాజాగా ఆయన ఎక్స్ వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఉద్యమంలో భాగంగా 2011 నవంబర్ 16 నుంచి చేపట్టిన పాదయాత్రకు 15 ఏళ్లు పూర్తయినట్లు తెలిపారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ పిలుపు మేరకు ఆరు రోజుల పాటు సాగిన ఆ పాదయాత్ర తనకు ఓ గొప్ప జ్ఞాపకమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యమ చరిత్రను ప్రస్తావిస్తూ, సోనియా గాంధీపై, కాంగ్రెస్‌పై ఆయన ఈ విమర్శలు చేసినట్లు స్పష్టమవుతోంది. 21 వరకు తాను



రాజీవ్, సోనియాల అనుబంధంపై వ్యాఖ్యలు.. రాహుల్ గాంధీ కౌంటర్

- సోనియా గాంధీ పుస్తకావిష్కరణలో తల్లిదండ్రుల అనుబంధాన్ని గుర్తుచేసుకున్న రాహుల్
- తల్లిదండ్రుల భోజన సమయాల గురించి మాట్లాడిన వ్యాఖ్యలపై విమర్శలు
- విమర్శలకు కౌంటర్‌గా ఎక్స్‌లో శివపార్వతుల శిల్పం ఫొటో పోస్ట్ చేసిన ప్రతిపక్ష నేత

బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారులను ఉద్దేశించి రాహుల్ గాంధీ రాజకీయ వ్యాఖ్యలు

విద్వేషం నుంచి విముక్తి కల్పించి ప్రేమను పంచడమే తన విధి అని వెల్లడి

తల్లిదండ్రులైన మాజీ ప్రధాని

(మిగతా 2వ పేజీలో..)



హైదరాబాద్‌లో రోడ్ల పండుగ.. హాజరుకానున్న 3000 మందికి పైగా దేశ, విదేశీ ప్రతినిధులు

హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ 85వ వార్షిక సదస్సు

19న ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి గడ్కరీ

తెలంగాణ సంస్కృతి, అభివృద్ధిని చాటేలా ప్రత్యేక ఏర్పాట్లు

రామప్ప పెవిలియన్‌తో పాటు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లు

భారత రహదారుల కాంగ్రెస్ (ఐఆర్సీ) 85వ వార్షిక సదస్సుకు హైదరాబాద్ నగరం వేదికైంది. ఈ నెల 19 నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమానికి దేశ, విదేశాల నుంచి 3,000 మందికి పైగా రోడ్ ఇంజినీర్లు, అధికారులు, మౌలిక సదుపాయాల నిపుణులు

(మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సంపాదకీయం

జనసంద్రోహంలో ఒంటరి మనిషి.. మాయమవ్వుతున్న మానవ సంబంధాలు!

మనిషి చుట్టూ వేలమంది ఉన్నా మనసులో ఒంటరితనం పెరుగుతున్న విచిత్రమైన పరిస్థితి నేటి సమాజంలో కనిపిస్తోంది. అపార్ట్‌మెంట్లలో వందల కుటుంబాలు నివసిస్తున్నా పక్కింటి వారి పేర్లు కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి. ఒకే ఇంట్లో కుటుంబ సభ్యులందరూ ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ప్రపంచంలో మునిగిపోతున్నారు. ఒకప్పుడు సాయంత్రం వేళ వీధుల్లో పిల్లల ఆటలు, పెద్దల పలకరింపులు, కుటుంబ సభ్యుల సంభాషణలతో సందడి కనిపించేది. ఇప్పుడు ఆ స్థానాన్ని మొబైల్ తెరలు, టెలివిజన్లు, సామాజిక మాధ్యమాలు ఆక్రమిస్తున్నాయి. ఆధునిక జీవితం సౌకర్యాలను పెంచినా.. మనుషుల మధ్య ఆత్మీయతను అదే స్థాయిలో పెంచలేకపోతోందనే వాస్తవాన్ని విస్మరించలేం.

పలకరింపులు కరువవుతున్నాయా?

ఒకప్పుడు గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ పక్కింటి వారి కష్టసుఖాల్లో అందరూ భాగస్వాములయ్యేవారు. ఎవరి ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా, అనారోగ్యం ఎదురైనా చుట్టుపక్కల వారు ముందుకొచ్చేవారు. ఆత్మీయతకు రక్తసంబంధమే అవసరం లేదని నిరూపించే అనుబంధాలు ఉండేవి. ఇప్పుడు సమయాభావం, ఉద్యోగ ఒత్తిడి, వ్యక్తిగత జీవితానికి పరిమితమైన ఆలోచనా విధానం కారణంగా పరిచయాలు తగ్గుతున్నాయి. పలకరించడానికి కూడా సమయం కేటాయించలేని స్థితి ఏర్పడుతోంది.పొరుగువారితో కనీస పరిచయం లేకపోవడం అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులకు దారితీయవచ్చు. సామాజిక సంబంధాలు కేవలం స్నేహానికే కాదు.. పరస్పర సహకారం, భద్రత, మానసిక ప్రశాంతతకు కూడా అవసరం.

సోషల్ మీడియాలో వేల మంది.. జీవితంలో తోడు ఎంతమంది?

సామాజిక మాధ్యమాల్లో వందలాది మంది స్నేహితులు, అనుచరులు ఉన్నప్పటికీ నిజ జీవితంలో మనసులోని మాట చెప్పుకునే వ్యక్తి లేకపోవడం చాలామందిలో కనిపిస్తున్న సమస్య. ఇతరుల సంతోషాలు, విజయాలు, విహారయాత్రలు చూస్తూ తమ జీవితాన్ని వారితో పోల్చుకోవడం వల్ల కొందరిలో అసంతృప్తి పెరుగుతోందిఆన్‌లైన్‌లో పలకరింపులు, స్పందనలు ఉన్నంత మాత్రాన నిజమైన అనుబంధం ఏర్పడినట్లు కాదు. కష్టసమయంలో పక్కన నిలిచే వ్యక్తి, బాధను ఓపికగా వినే స్నేహితుడు, మనసుకు ధైర్యం చెప్పే కుటుంబ సభ్యుడు ఉండటం ఎంతో ముఖ్యం. సాంకేతికతను సంబంధాలు పెంచుకునేందుకు ఉపయోగించుకోవాలి తప్ప.. ప్రత్యక్ష అనుబంధాలకు దూరమయ్యే సాధనంగా మార్చుకోకూడదు.

వృద్ధుల్లో ఒంటరితనం.. కుటుంబాలకు హెచ్చరిక

ఉద్యోగాలు, విద్య, ఇతర అవకాశాల కోసం పిల్లలు విదేశాలకు, ఇతర నగరాలకు వెళ్తున్నారు. దీంతో వృద్ధ తల్లిదండ్రులు స్వస్థలాల్లో ఒంటరిగా జీవించాల్సి వస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు లేకపోయినా మాట్లాడేందుకు మనుషులు లేక కొందరు మానసిక వేదనకు గురవుతున్నారు. అనారోగ్య సమయంలో సహాయం అందకపోవడం మరో సమస్య. వృద్ధులకు అవసరమయ్యేది కేవలం డబ్బు, మందులు మాత్రమే కాదు. కుటుంబ సభ్యుల ఆప్యాయత, గౌరవం, సమయం కూడా అవసరం. దూరంగా ఉన్న పిల్లలు ప్రతిరోజూ కొద్దిసేపైనా తల్లిదండ్రులతో మాట్లాడాలి. వారి ఆరోగ్యం, అవసరాలు తెలుసుకోవాలి. సాధ్యమైనప్పుడల్లా కలిసి సమయం గడపాలి. వృద్ధాప్యాన్ని ఒంటరితనంగా మార్చకుండా చూడటం ప్రతి కుటుంబ బాధ్యత.

పిల్లల బాల్యాన్ని మొబైల్ ఆక్రమించకూడదు

నేటి బాల్యంలో ఆటస్థలాల కంటే మొబైల్ తెరలకే ఎక్కువ స్థానం లభిస్తోంది. స్నేహితులతో కలిసి ఆడుకోవడం, కథలు వినడం, ప్రకృతిని ఆస్వాదించడం వంటి అనుభవాలు తగ్గుతున్నాయి. తల్లిదండ్రులు పని ఒత్తిడితో పిల్లలకు మొబైల్ ఇచ్చి నిశ్శబ్దంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇది తాత్కాలికంగా సౌకర్యంగా అనిపించినా దీర్ఘకాలంలో పిల్లల సామాజిక నైపుణ్యాలు, ప్రత్యక్ష సంభాషణ అలవాట్లపై ప్రభావం చూపవచ్చు.పిల్లలకు ఆటలు, పుస్తక పఠనం, కుటుంబ విహారాలు, స్నేహితులతో కలిసి గడిపే సమయం అందించాలి. వారితో తల్లిదండ్రులు మాట్లాడాలి. వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. పిల్లలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే వాతావరణం ఇంట్లో ఉండాలి.

ఒంటరితనాన్ని గుర్తించడం సమాజ బాధ్యత

ఒంటరితనం ప్రతి ఒక్కరిలో ఒకే విధంగా కనిపించదు. కొందరు తమ బాధను బయటపెట్టరు. మరికొందరు జనంతో కలిసే ఉన్నప్పటికీ అంతర్గతంగా ఒంటరితనాన్ని అనుభవిస్తారు. అందువల్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు ఒకరి ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. బాధలో ఉన్నవారిని విమర్శించకుండా వారి మాట వినాలి. అవసరమైతే మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం తీసుకునేలా ప్రోత్సహించాలి. స్థానిక సంస్థలు, అపార్ట్‌మెంట్ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సామూహిక సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించవచ్చు. వృద్ధులు, పిల్లలు, యువత అందరూ పాల్గొనే వేదికలు ఏర్పాటుచేస్తే సామాజిక అనుబంధాలు బలపడతాయి.

మళ్లీ మనుషులతో మనం కలవాలి

మారుతున్న జీవనశైలిని పూర్తిగా వెనక్కి తీసుకెళ్లడం సాధ్యం కాదు. సాంకేతికతను వదిలేయాల్సిన అవసరమూ లేదు. కానీ దానికి మన జీవితాన్ని పూర్తిగా అప్పగించకూడదు. రోజులో కొంత సమయాన్ని మొబైల్‌కు దూరంగా కుటుంబ సభ్యులతో గడపాలి. పాత స్నేహితులను కలవాలి. పొరుగువారిని పలకరించాలి. పిల్లలతో ఆడుకోవాలి. వృద్ధుల అనుభవాలను వినాలి. మనిషికి సౌకర్యాలు అవసరం.. కానీ వాటికంటే ఎక్కువగా ఆప్యాయత అవసరం.

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వండి: ఛత్తీస్‌గఢ్ సీఎంకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజల తాగు, సాగునీటి అవసరాల నిమిత్తం సమ్మక్క సాగర్ బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతించాలని, మిగిలిన క్లియరెన్సుల విషయంలోనూ సహకరించాలని కోరారు. కరవు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల అవసరాలను తీర్చేందుకు గోదావరి జలాలను వినియోగించుకోవడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.గతంలో ఈ ప్రాజెక్టును కాంతనపల్లి వద్ద ప్రతిపాదించగా, అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే పరిస్థితి ఉండేది. దీనివల్ల 17 ఆదివాసీ గ్రామాలు మునిగిపోవడంతో పాటు భద్రత, మౌలిక వసతులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఏర్పడింది. దాంతో ముంపు తీవ్రతను కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రదేశాన్ని తుపాకులగూడెంకు మార్చినట్లు ముఖ్యమంత్రి వివరించారు.ప్రాజెక్టు ప్రభావంపై అధ్యయనం జరిపేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన మేరకు తెలంగాణ సర్కార్ రూ. 9.883 కోట్లను ఏప్రిల్‌లోనే చెల్లించింది. అనంతరం క్షేత్రస్థాయి అధ్యయనం పూర్తి చేసిన ఐఐటీ ఖరగ్‌పూర్ తన నివేదికను జూలై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి అందజేసింది. తుపాకులగూడెం వద్ద బ్యారేజీ నిర్మించడం వల్ల ఛత్తీస్‌గఢ్ పరిధిలో కేవలం 33 ఎకరాల భూమి మాత్రమే ముంపునకు గురవుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. అత్యంత భారీ వరదలు వచ్చిన సందర్భంలో కూడా ఈ ముంపు ప్రాంతం 100 ఎకరాలకు మించదని తేలింది.తుపాకులగూడెం వద్ద ఇప్పటికే సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. పూర్తిస్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద ఈ బ్యారేజీ నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలుగా ఉంది. ఛత్తీస్‌గఢ్ భూభాగంలో అవసరమైన భూసేకరణ, పరిహారం, పునరావాస చర్యలకు సంబంధించి నిబంధనల ప్రకారం నిధులు చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిర్మాణం పూర్తయినందున ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎన్ఓసీ జారీతో పాటు ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోటీ కాదు, సహకారమే మన భవిష్యత్తు: ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి)

మన భవిష్యత్తును పోటీతో కాకుండా సహకారంతో తీర్చిదిద్దుకోవడం చాలా అవసరమన్నారు. రాబోయే సంవత్సరాల్లో 'వికసిత భారత్ 2047', 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045' మన ఉమ్మడి ఆకాంక్షలను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.గత కొన్నేళ్లుగా తమ 'యాక్ట్ ఈస్ట్' విధానం భారత్–ఆసియాన్ సంబంధాలకు కొత్త ఊపునిచ్చిందని మోదీ తెలిపారు. తమ భాగస్వామ్యం కేవలం సాంస్కృతిక వారసత్వానికే పరిమితం కాకుండా, డిజిటల్, రక్షణ, అంతరిక్షం వంటి కొత్త రంగాల్లోకి విస్తరిస్తోందని వివరించారు. 2014 నుంచి ప్రజా సంబంధాలను బలోపేతం చేసేందుకు 100కు పైగా కార్యక్రమాలు చేపట్టామని, 250 క్విక్ ఇంపాక్ట్ ప్రాజెక్టులు ప్రారంభించామని, 10,000కు పైగా స్కిల్ బిల్డింగ్ స్కాలర్‌షిప్‌లు అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని, శాంతి, స్థిరత్వం గతంలో కంటే ఇప్పుడు ఎంతో అవసరమని మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో 'మన భవిష్యత్తును కలిసి నిర్మించుకుందాం' అనే ఈ ఏడాది సదస్సు థీమ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఈ సందర్భంగా, సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ రొమాల్డెజ్ మార్కోస్ జూనియర్‌కు మోదీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

రాజీవ్, సోనియాల అనుబంధంపై వ్యాఖ్యలు.. రాహుల్ గాంధీ కౌంటర్

మొదటి పేజీ తరువాయి)

రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల మధ్య ఉన్న అనుబంధంపై తాను చేసిన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రేమను వ్యక్తపరచడం, అనుభవించడం అనే అంశంపై ఆయన ఒక రాజకీయ ప్రకటనను విడుదల చేస్తూ, దానికి సంబంధించి ఒక ఆలయ శిల్పం ఫొటోను జతచేశారు.సోనియా గాంధీ జీవిత అనుభవాలతో రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సోమవారం రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా తన తల్లిదండ్రుల మధ్య ఉన్న ప్రేమానురాగాలను ఆయన గుర్తుచేసుకున్నారు. భోజనం చేసే ప్రతిసారీ తన తండ్రి రాజీవ్ గాంధీ ఒళ్లో తల్లి సోనియా గాంధీ కూర్చునేవారని రాహుల్ పేర్కొన్నారు. "ప్రతి రోజూ భోజన సమయంలో నాన్న ఉండేవారు, నాన్న ఒళ్లో అమ్మ కూర్చునేది" అని రాహుల్ అనడంతో, వేదికపై ఉన్న సోనియా గాంధీ కాస్త ఇబ్బందిగా నవ్వారు. సాధారణంగా ఇతర కుటుంబాల్లో ఇలాంటి దృశ్యాలు కనిపించవని ఆ తర్వాత తనకు అర్థమైందని, చిన్నతనంలో ఇది సాధారణ విషయమే అనుకుని ఒక స్నేహితుడిని వారి తల్లిదండ్రుల గురించి కూడా అలాగే ప్రశ్నించానని రాహుల్ వివరించారు.రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు, చర్చలు మొదలయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన రాహుల్ గాంధీ, మంగళవారం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. పవిత్ర నందిపై శివపార్వతులు కలిసి ఆసీనులైనట్లు ఉన్న ఒక పురాతన ఆలయ శిల్పం చిత్రాన్ని ఆ పోస్ట్‌కు జతచేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పందిస్తూ.. "బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో భయం, కోపం, విద్వేషం గూడుకట్టుకున్నాయి. అవి వారిని ప్రేమను అనుభూతి చెందకుండా, వ్యక్తపరచకుండా అడ్డుకుంటున్నాయి. ఒక నిజమైన హిందువుగా వారిని ఈ వలయం నుంచి విముక్తులను చేయడం నా బాధ్యత. తద్వారా వారు కూడా తమ జీవితాల్లో అద్భుతమైన ప్రేమ, అనుబంధాల సౌందర్యాన్ని, ఆనందాన్ని అనుభవించడం ప్రారంభిస్తారు... సత్యం శివం సుందరం" అని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో రోడ్ల పండుగ.. హాజరుకానున్న 3000 మందికి పైగా దేశ, విదేశీ ప్రతినిధులు

మొదటి పేజీ తరువాయి)

హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ సదస్సును ప్రారంభించనుండగా, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ప్రసంగిస్తారు.ఈ భారీ కార్యక్రమానికి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోమవారం తెలిపారు. హైటెక్స్‌లో జరిగే ఈ సదస్సులో భాగంగా దాదాపు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. "హైదరాబాద్‌కు వచ్చే అతిథులను ఎంతో ఆత్మీయంగా స్వాగతిస్తాం. ఈ సదస్సుకు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి గొప్ప అనుభూతిని పంచాలనుకుంటున్నాం. 'రైజింగ్ తెలంగాణ' కింద, బలమైన సాంస్కృతిక మూలాలున్న ఒక ఆధునిక రాష్ట్రం భవిష్యత్ రహదారులను ఎలా నిర్మిస్తోందో గర్వంగా ప్రపంచానికి చూపిస్తాం" అని మంత్రి కోమటిరెడ్డి వివరించారు.ఈ సదస్సులో భాగంగా ఏర్పాటు చేసే టెక్నికల్ ఎగ్జిబిషన్‌ను నవంబర్ 18న ప్రారంభించనున్నారు. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం, కీలకమైన మౌలిక సదుపాయాలు, రోడ్డు ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా 'రామప్ప టెంపుల్ పెవిలియన్' ఏర్పాటు చేయడం విశేషం. ప్రతినిధుల కోసం వసతి, రవాణా, ఆతిథ్యం విషయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వారికి హైదరాబాదీ వంటకాల రుచులను అందించడంతో పాటు, సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు. సదస్సు ముగిసిన తర్వాత నవంబర్ 22న ప్రతినిధుల కోసం ప్రత్యేక పర్యటనలు ఏర్పాటు చేశారు. 1934లో ఏర్పాటైన ఇండియన్ రోడ్ కాంగ్రెస్, దేశంలోని హైవే ఇంజినీర్ల అత్యున్నత సంస్థ. రోడ్లు, వంతెనల ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన ప్రమాణాలు, మార్గదర్శకాలను అభివృద్ధి చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం

మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. ఆలస్యం చేయకుండా 6:35 గంటలకు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజిన్లు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి సాయంత్రం 7:15 గంటల కల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో మంటలను ఆర్పడంతో అవి పక్కనే ఉన్న ఇతర కోచ్‌లకు గానీ, ప్లాట్‌ఫారానికి గానీ వ్యాపించలేదు. ఈ ఘటనపై దక్షిణ మధ్య రైల్వే (SCR) అధికారికంగా స్పందించింది. మంటలు చెలరేగిన బోగీ పూర్తిగా ఖాళీగా ఉందని, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని, ప్రాణనష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే రైలు బోగీలో మంటలు చెలరేగడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. ప్రమాద తీవ్రత సకాలంలో తగ్గడంతో స్టేషన్ అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

వచ్చే నెలలో పీవీ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం

భీమదేవరపల్లి, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరిట హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో కేంద్రం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు.మంగళవారం విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఫోటో గ్యాలరీ, మ్యూజియం, కాన్ఫరెన్స్ హాల్, ఆర్ట్ గ్యాలరీతో పాటు ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విజ్ఞాన కేంద్రంలో దాదాపు అన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, ఆర్ట్ గ్యాలరీ పనులు మాత్రమే కొనసాగుతున్నాయని తెలిపారు. ఆర్ట్ గ్యాలరీలో పీవీ నరసింహారావు విగ్రహం ఏర్పాటు, సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాల అమరిక తదితర పనులను ఆర్కిటెక్ట్ పర్యవేక్షణలో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రాంగణంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి వచ్చే నెలలో పీవీ విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సృజన, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, తహసీల్దార్ రాజేష్, డీఈలు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



2,418 మందికి చేయూత పింఛన్ల మంజూరి పత్రాల పంపిణీ

చౌటుప్పల్, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరి పత్రాల పంపిణీ కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' ఆలపించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మునుగోడు నియోజకవర్గ పరిధిలోని చౌటుప్పల్ మున్సిపాలిటీ, చౌటుప్పల్, నారాయణపూర్ మండలాల్లో కొత్తగా చేయూత పింఛన్లకు ఎంపికైన 2,418 మంది లబ్ధిదారులకు మంజూరి పత్రాలను పంపిణీ చేశారు. ఇందులో చౌటుప్పల్ మున్సిపాలిటీకి చెందిన 531 మంది, చౌటుప్పల్ మండలానికి చెందిన 970 మంది, నారాయణపూర్ మండలానికి చెందిన 917 మంది ఉన్నారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు పింఛన్లకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు నేడు శుభదినమని అన్నారు. గత పదేళ్లుగా కొత్త పింఛన్లు మంజూరు కాలేదని, వేలాది మంది అర్హులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు.వృద్ధాప్య పింఛన్ల కోసం కూడా ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. త్వరలోనే వృద్ధాప్య పింఛన్లు కూడా మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ



కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ సీఈవో శోభారాణి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, చౌటుప్పల్, నారాయణపూర్ మండలాల ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంటుకట్టడం, తేనెటీగల పెంపకంపై కీతవారిగూడెం రైతులకు అవగాహన

కీతవారిగూడెం, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అధిక దిగుబడులు, అదనపు ఆదాయం సాధించాలని వ్యవసాయ విద్యార్థినులు సూచించారు.ఏలూరులోని సీహెచ్ఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ చివరి సంవత్సరం విద్యార్థినులు గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) మార్గదర్శకత్వంలో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా కీతవారిగూడెం గ్రామ రైతులకు అంటుకట్టడం, తేనెటీగల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అంటుకట్టడం (గ్రాఫ్టింగ్) ప్రాముఖ్యత, వివిధ రకాలు, అనుసరించాల్సిన పద్ధతులు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థినులు రైతులకు వివరించారు. అంటుకట్టడం ద్వారా నాణ్యమైన మొక్కలను అభివృద్ధి చేయడంతో పాటు, తక్కువ సమయంలో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ పద్ధతిని అనుసరించడం వల్ల మొక్కల నాణ్యత పెరగడంతో పాటు అధిక దిగుబడులకు అవకాశం ఉంటుందని వివరించారు.అనంతరం తేనెటీగల పెంపకం (మధుపాలన)పై అవగాహన కల్పించారు. తేనెటీగల పెంపకం ద్వారా తేనెతో పాటు ఇతర ఉత్పత్తులను విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. తేనెటీగలు పంటల్లో పరాగసంపర్క ప్రక్రియకు ఎంతగానో దోహదపడతాయని, తద్వారా పంటల దిగుబడి, నాణ్యత పెరుగుతాయని వివరించారు. తక్కువ పెట్టుబడితో మధుపాలనను అనుబంధ వ్యవసాయ వృత్తిగా చేపట్టడం ద్వారా రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావచ్చని సూచించారు.వ్యవసాయంలో నూతన పద్ధతులు, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకొని మెరుగైన లాభాలు పొందవచ్చని విద్యార్థినులు



వివరించారు. కార్యక్రమంలో రైతులు పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గుండు సతీష్, వెల్పుల రామలింగయ్య, నర్సింగ్, నరేష్, ఎస్.కె. పెరుసాహెబ్, కత్రేవుల వెంకటేష్, ముంత నాగయ్య, ఎల్లావుల రాములు, కత్రేవుల నర్సయ్య, సనగాని వెంకటేష్, బడేటి వినయ్, దాసరి సైదులు, పిల్లి యాదగిరి, బొల్లెపల్లి పాపయ్య తదితర రైతులు పాల్గొన్నారు. బీఎస్సీ అగ్రికల్చర్ చివరి సంవత్సరం విద్యార్థినులు ఎం. నవ్యశ్రీ, వై. మనీషా, పి. హేమలత, ఐ. సత్యజ్యోతి, వై. సౌమ్య, ఆర్. మోనిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

అఖిల భారత యాదవ సంఘం చింతలపాలెం మండల నూతన కమిటీ నియామకం

చింతలపాలెం, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

అఖిల భారత యాదవ సంఘం చింతలపాలెం మండల నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు జక్కుల మల్లయ్య యాదవ్ నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.మండల అధ్యక్షుడిగా ముసగ చిన్న వీరయ్య, ఉపాధ్యక్షుడిగా కుంటి గౌర్ల లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా బడుగుల శ్రీనివాస్, కోశాధికారిగా దాసరి లింగారావును నియమించారు.ఈ సందర్భంగా జక్కుల మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ యాదవ సంఘం ఐక్యత, అభివృద్ధి కోసం నూతన కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. మండలంలోని యాదవులందరినీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.ఈ నియామక కార్యక్రమానికి చింతలపాలెం మండలంలోని 16 గ్రామాల నుంచి సుమారు 100 మంది యాదవ సంఘం ముఖ్య నాయకులు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పోలేడి శ్రీనివాస్, మల్కాపురం గ్రామ సర్పంచ్ చింత్రాల ఆంజనేయులు, చిరా శ్రీనివాస్‌తో పాటు హుజూర్‌నగర్‌కు చెందిన జక్కుల శంబయ్య, జాల గురవయ్య, జక్కుల జయరాం, పండగ కొరివేరయ్య, జక్కుల రమేష్, పాశం వెంకట్ నారాయణ తదితర యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.



సూర్యాపేట డీఎంహెచ్‌వోగా డాక్టర్ కోటి రత్నకు అదనపు బాధ్యతలు

సూర్యాపేట, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ కోటి రత్నకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుత డీఎంహెచ్‌వో డాక్టర్ పి. వెంకట రమణను ప్రభుత్వం రిలీవ్ చేయడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కోటి రత్నను తదుపరి ఆదేశాలు వెలువడే వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఇన్‌చార్జిగా నియమించారు. వెంటనే బాధ్యతలు స్వీకరించి, నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చర్లపల్లి పాఠశాలలో విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

హనుమకొండ, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు డాక్టర్ సంధ్య విద్యార్థులకు జనరల్ హెల్త్ చెకప్ నిర్వహించి, అవసరమైన సూచనలు, మందులు అందించారు.విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొని డాక్టర్ సంధ్యకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకవద్దేవా, కంచ రాజ్‌కుమార్, పుల్లూరి రామకృష్ణ, బండి శ్వేత, ఏఎన్ఎం కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పాదయాత్ర బృందానికి వంటేరు ప్రతాపరెడ్డి స్వాగతం.. మద్దతు

గజ్వేల్, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



పాదయాత్ర చేపడుతున్న బృందానికి గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి స్వాగతం పలికి తన సంఘీభావాన్ని, మద్దతును ప్రకటించారు. పాదయాత్రలో భాగంగా ఆయనను కలిసిన బృంద సభ్యులను ఆప్యాయంగా ఆహ్వానించి, శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా పాదయాత్ర బృందం చేపడుతున్న కార్యక్రమాల పట్ల తన మద్దతును తెలియజేస్తూ, వారి ప్రయత్నాలకు సంఘీభావం ప్రకటించారు. పాదయాత్ర బృందానికి స్వాగతం పలికి సత్కరించడం పట్ల సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కుక్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కనకయ్య ముదిరాజ్‌తో పాటు స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొని పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు

భారత్ సమ్మిట్‌లో వ్యాఖ్యలపై బీజేపీ ఫిర్యాదు.. జియాకోమో ఫిలిబెక్‌పై చర్యలు తీసుకోవాలి

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో భారత ప్రజాస్వామ్య వ్యవస్థపై విదేశీ ప్రతినిధి జియాకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు జిల్లా ఎస్పీని కలిసి అధికారికంగా ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా నిషీధర్ రెడ్డి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ వ్యవస్థ, ప్రజాస్వామ్య ప్రక్రియలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దేశ గౌరవానికి భంగం కలిగించే అంశమని పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యంపై విదేశీ ప్రతినిధి వ్యాఖ్యలు చేస్తుంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చప్పట్లు కొట్టి ప్రోత్సహించడం సరికాదని విమర్శించారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, భారత్ సమ్మిట్ నిర్వాహకుల పాత్రపైనా దర్యాప్తు చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. భారత సార్వభౌమాధికారం, రాజ్యాంగ గౌరవం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగదీశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరుకల గణపతి, రాష్ట్ర నాయకులు బట్టు రవి, దుప్పటి భద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, తాడికొండ రవికిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు సామల మధుసూదన్ రెడ్డి, వట్టెం తిరుపతి, మునీందర్, అర్బన్ అధ్యక్షుడు గీస సంపత్, రూరల్ అధ్యక్షుడు పులగుజ్జు రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ఆత్మకూరు, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు.మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్స్‌లో మండల పరిధిలోని వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత, గీత కార్మికులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ కొత్త పింఛన్లు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో ఇందిరా మహిళా డైరీ, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ.500 బోనస్, సన్నబియ్యం పంపిణీ, మహాలక్ష్మి, గ్యాస్ సబ్సిడీ, వడ్డీలేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు తదితర కార్యక్రమాలు ఉన్నాయని వివరించారు.




ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

నేరేడుచర్లలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష సమావేశం

నేరేడుచర్ల, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల నియంత్రణకు ప్రజల సహకారంతో సమగ్ర చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కొణతం వెంకటరెడ్డి తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రహదారి భద్రత మెరుగుదల, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా మంగళవారం ఆయన అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, ఎస్ఐ సీహెచ్. గోపాల్ రెడ్డి, తహశీల్దార్ సురిగి సైదులు, హైవే ఏఈ తదితర అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్ ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రధాన రహదారులపై వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించడం, రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించడం, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. పట్టణ అభివృద్ధి, ప్రజల సౌకర్యం, రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు, ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.ట్రాఫిక్ నియంత్రణ అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడికి కూడా బాధ్యత ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేయాలని, పట్టణంలో ట్రాఫిక్



సమస్యల శాశ్వత పరిష్కారానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

అయ్యప్ప స్వామి పంబ ఆరట్టు పడిపూజ మహోత్సవానికి భక్తులకు ఆహ్వానం

గరిడేపల్లి, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



గరిడేపల్లి మండలంలో నవంబర్ 18, బుధవారం నిర్వహించనున్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారి పవిత్ర పంబ ఆరట్టు పడిపూజ మహోత్సవానికి మండల ప్రజలు, అయ్యప్ప స్వాములు, గురుస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గరిడేపల్లి మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్ గౌడ్ కోరారు.ఈ సందర్భంగా ఆయన తరఫున మహోత్సవానికి విచ్చేసే భక్తులందరికీ హృదయపూర్వక స్వాగతం పలికారు. అయ్యప్ప స్వామివారి ఆధ్యాత్మిక వేడుకలో ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు, కృపాకటాక్షాలు పొందాలని ఆకాంక్షించారు. మండల ప్రజలు, అయ్యప్ప మాలధారులు, గురుస్వాములు, భక్తులు కుటుంబ సమేతంగా హాజరై ఈ పవిత్ర మహోత్సవాన్ని భక్తి పారవశ్యంతో జరుపుకోవాలని ఆహ్వానించారు.

చింతలపాలెం మండల అఖిల భారత యాదవ సంఘం నూతన కమిటీ నియామకం

చింతలపాలెం, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



చింతలపాలెం మండలంలో అఖిల భారత యాదవ సంఘం నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యాదవుల ఐక్యత, అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.నూతన కమిటీ అధ్యక్షుడిగా మునగ చిన్న వీరయ్య, ఉపాధ్యక్షుడిగా కుంటి గొర్ల లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా బడుగుల శ్రీనివాస్, ట్రెజరర్‌గా దాసరి లింగారావును నియమించారు. ఈ మేరకు నియోజకవర్గ అధ్యక్షుడు జక్కుల మల్లయ్య యాదవ్ నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి చింతలపాలెం మండలంలోని 16 గ్రామాల నుంచి సుమారు 100 మంది యాదవ సంఘం ప్రముఖులు, నాయకులు హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలేడి శ్రీనివాస్, మల్కాపురం గ్రామ సర్పంచ్ చింత్రాల ఆంజనేయులు, చిరా శ్రీనివాస్ తదితర మండల నాయకులతో పాటు హుజూర్‌నగర్ నుంచి జక్కుల శంబయ్య, జాల గురవయ్య, జక్కుల జయరాం, పండగ కొరివేరయ్య, జక్కుల రమేష్, పాశం వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు సంఘ అభివృద్ధికి, యాదవుల సమస్యల పరిష్కారానికి, సామాజిక ఐక్యతకు ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

మామునూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత

వరంగల్, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ మంగళవారం మామునూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు.స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణ తీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సీపీ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించాలని ఆదేశించారు.పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యమైన దర్యాప్తు ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యతతో పనిచేయాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.అదేవిధంగా డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో పాటు అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పోలీస్ శాఖ సమన్వయంతో కృషి చేయాలని సీపీ సూచించారు.ఈ ఆకస్మిక తనిఖీలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, పర్వతగిరి సీఐ ఆర్. సంతోష్ కుమార్, మామునూరు ఇన్‌స్పెక్టర్ ఈ. శ్రీనివాస్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వరంగల్ రంగశాయిపేటలో విషాదం.. దంపతుల ఆత్మహత్య

వరంగల్, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ నగరంలోని రంగశాయిపేటలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. శోభ, సంజయ్ అనే దంపతులు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది.అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. దంపతులు ముందుగా తమ పెంపుడు కుక్కను చంపిన అనంతరం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.కుటుంబంలో తలెత్తిన కలహాలే ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలిస్తున్నారు. దంపతుల ఆత్మహత్యకు గల అసలు కారణాలపై దర్యాప్తు చేపట్టాల్సి ఉంది.ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

కీసర సర్కిల్ పరిధిలో 2,500 మందికి నూతనంగా చేయూత పెన్షన్లు మంజూరు

జవహర్‌నగర్, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్లు అందించడమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్ల ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం దమ్మాయిగూడలోని సాయి భవాని ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకోవాలనే సదుద్దేశంతో ఈ నెల 19వ తేదీ నుంచి రాష్ట్రంలో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న కుటుంబ యజమానికి రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించనుందని వివరించారు.రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4 లక్షల 63 వేల మందికి చేయూత పెన్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వంపై ప్రతి నెలా అదనంగా రూ.114 కోట్ల ఆర్థిక భారం పడుతున్నప్పటికీ అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా 2,553 చేయూత పెన్షన్లు మంజూరు కాగా, కీసర సర్కిల్ పరిధిలో సుమారు 2,500 మందికి నూతనంగా పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కీసర సర్కిల్ పరిధిలోని లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు ఉత్తర్వులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్, చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, స్థానిక నాయకులు కారింగుల శంకర్ గౌడ్, గొడుగు వేణు, రజిత గోపాల్, మాట్లా శ్రీనివాస్, బూడిద వెంకటేష్, చిట్టిబాబు, కారింగుల రాజు గౌడ్, మంజుల, సుగుణ, కాలేశా, రేసు లక్ష్మి, సరిత, భాస్కర్, రాహుల్ కదం, బబ్లూ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నరసింహా ఐపీఎస్

అర్వపల్లి, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ మంగళవారం అర్వపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ, పెట్రోలింగ్ తీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని, కేసుల నమోదు విషయంలో ఎలాంటి జాప్యం చేయరాదని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రాథమిక విచారణను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు భరోసా కల్పిస్తూ వారి భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని, పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.మండల పరిధిలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పాత నేరస్థులు, నేరాలకు అలవాటు పడిన వ్యక్తులు, షీటర్లు, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు.గ్లోబల్ జియోట్యాగింగ్ విధానం ద్వారా నేరస్థులను పర్యవేక్షించాలని, వారిని మ్యాపింగ్ చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని పోలీస్ అధికారులకు సూచించారు.ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నరసింహ సూచించారు.ఈ తనిఖీలో నాగారం సీఐ నాగేశ్వరరావు, అర్వపల్లి ఎస్ఐ మధు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వైఎస్ఆర్ నగర్‌లో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్

ప్రాణాలు పోతేనే అధికారులు స్పందిస్తారా? రాత్రివేళ వీధి దీపాలు లేక ప్రమాదాల ముప్పు



జవహర్‌నగర్, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

జవహర్‌నగర్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్‌లో రోడ్డుపై ఎత్తుగా నిర్మించిన డ్రైనేజీ మ్యాన్‌హోల్ వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రహదారిపై మ్యాన్‌హోల్ ఎత్తుగా ఉండటంతో అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రివేళ వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మ్యాన్‌హోల్ కనిపించక పలువురు ద్విచక్ర వాహనదారులు దానిని ఢీకొని గాయపడుతున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొంటున్నారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులకు పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రాణనష్టం జరిగిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి మ్యాన్‌హోల్‌ను రోడ్డు స్థాయికి సమానంగా సరిచేయాలని, వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించకముందే శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆసిఫాబాద్‌లో అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ

ఆసిఫాబాద్, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు.ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పెన్షన్లు వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు నిఖిల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామయ్య, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు. పెన్షన్లు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అదనపు భూమిపై రైతులకు యాజమాన్య హక్కులు ఉండవు.. రీ-సర్వేపై రెవెన్యూ శాఖ కీలక మార్గదర్శకాలు!

హనుమకొండ, 17 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ, ప్రభుత్వ భూముల రీ-సర్వే నిర్వహణకు సంబంధించి రెవెన్యూ శాఖ కీలక మార్గదర్శకాలు జారీ చేసినట్లు సమాచారం. రీ-సర్వే సమయంలో పట్టాదారు పాస్ పుస్తకంలో నమోదైన విస్తీర్ణం కంటే అదనంగా భూమి ఉన్నట్లు గుర్తిస్తే, ఆ అదనపు భూమిపై సంబంధిత రైతులకు స్వయంచాలకంగా యాజమాన్య హక్కులు లభించవని మార్గదర్శకాల్లో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.పట్టా రికార్డుల్లో నమోదైన భూమి విస్తీర్ణానికి మించి ఉన్న భూమిని అదనపు భూమిగా పరిగణించి, దానిపై హక్కుల విషయంలో రెవెన్యూ రికార్డులు, సంబంధిత ఆధారాలను పరిశీలించాలని సూచించినట్లు సమాచారం.అదేవిధంగా సర్వేలో గుర్తించిన అదనపు భూమిని అర్హత కలిగి, పట్టా విస్తీర్ణం కంటే తక్కువ భూమి కలిగిన రైతులకు నిబంధనల ప్రకారం సర్దుబాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది.మరోవైపు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా వాటి సరిహద్దులను పక్కాగా గుర్తించి, హద్దులను నిర్ధారించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. భూముల రీ-సర్వే ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు రైతుల భూ హక్కులకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని రెవెన్యూ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నట్లు



తెలుస్తోంది.

ఖమ్మం క్రాస్ రోడ్‌లో ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించిన జిల్లా ఎస్పీ

సూర్యాపేట, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను జిల్లా ఎస్పీ నరసింహ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రశాంత్ కుమార్, సీఐ వెంకటయ్య, ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డితో కలిసి రహదారిపై ట్రాఫిక్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు.ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన సేఫ్టీ కోన్స్‌ను పరిశీలించి, అవి సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం అక్కడ ఉన్న ప్రజలు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రహదారులపై ఇష్టానుసారంగా, నిషేధిత ప్రాంతాల్లో వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.సుమారు పది నిమిషాల పాటు అక్కడే ఉండి ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, రహదారి భద్రత, వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీస్ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు సురక్షిత ప్రయాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఇంటర్మీడియట్ సిలబస్‌లో ఎలాంటి మార్పు ఉండదు.. ఊహాగానాలను నమ్మొద్దన్న ఇంటర్ బోర్డు!




హనుమకొండ, 17 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే అంశంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ సిలబస్‌లో ఎలాంటి మార్పులు ఉండవని ఇంటర్మీడియట్ విద్యా మండలి స్పష్టం చేసినట్లు సమాచారం. సిలబస్ మారుతుందంటూ సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న వార్తలు, ఊహాగానాలను విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మవద్దని సూచించింది.నూతన విద్యా విధానం అమలుకు సంబంధించి పూర్తిస్థాయి మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. అధికారికంగా మార్గదర్శకాలు విడుదలయ్యే వరకు సిలబస్‌పై వస్తున్న ప్రచారాలను పట్టించుకోవద్దని సూచించినట్లు తెలుస్తోంది.మరోవైపు రాష్ట్రంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 12వ తరగతి వరకు ఒకే ఏకీకృత విద్యా విధానాన్ని అమలు చేయాలని పలువురు విద్యావేత్తలు బోర్డుకు సూచించినట్లు సమాచారం.ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు కేవలం 9, 10 తరగతుల నిర్వహణకే పరిమితం చేయకుండా, ఒకటో తరగతి నుంచే పాఠశాల తరగతులు నిర్వహించుకునేందుకు అనుమతులు కల్పించాలని వారు కోరినట్లు తెలుస్తోంది.విద్యా వ్యవస్థలో మార్పులు చేపట్టే సమయంలో విద్యార్థుల ప్రయోజనాలు, విద్యా ప్రమాణాలు, బోధనా విధానాలను దృష్టిలో ఉంచుకోవాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అర్హులందరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

వరంగల్, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. ఈ పథకంలో భాగంగా నూతనంగా ఎంపికైన లబ్ధిదారులకు మంగళవారం వరంగల్‌లోని ఎల్లిసాగర్ ఏఎస్ ఫంక్షన్ హాల్‌లో పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ పరిధిలోని వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు కలిపి మొత్తం 156 మంది నూతన లబ్ధిదారులకు మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా భోగి సువర్ణ సురేష్ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా అర్హులైన అనేక మంది పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.37వ డివిజన్‌లో ఇంకా పింఛన్లకు అర్హులైన వారు కొంతమంది ఉన్నారని, వారిని గుర్తించి సర్వే నిర్వహించడం ద్వారా అర్హులందరికీ చేయూత పింఛన్లు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డీఆర్డీఓ, బిల్ కలెక్టర్, స్థానిక నాయకులు సంగారబోయిన చందర్, వైద్యం లత, ప్రతాప్ తదితరులతో పాటు నూతన పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు అఖిలపక్ష సమావేశం

నేరేడుచర్ల, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను నియంత్రించి, పట్టణంలో రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కొణతం వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణంలోని ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, ఎస్ఐ సీహెచ్. గోపాల్ రెడ్డి, తహసీల్దార్ సురిగి సైదులు, హైవే ఏఈ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్ ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ప్రధాన రహదారులపై వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించడం, రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించడం, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై పలువురు తమ సూచనలు చేశారు.పట్టణ అభివృద్ధి, ప్రజల సౌకర్యం, రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని రాజకీయ పార్టీలు, వ్యాపారులు, ప్రజలు సమన్వయంతో సహకరించాలని సమావేశంలో కోరారు. ట్రాఫిక్ సమస్యల శాశ్వత పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ట్రాఫిక్ నియంత్రణ అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడికి కూడా బాధ్యత ఉందని సమావేశంలో పేర్కొన్నారు. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పట్టణంలో రాకపోకలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు.

మున్సిపల్ పన్నుల పెంపునకు వ్యతిరేకంగా బీజేపీ నిరసన దీక్షకు మద్దతు

ములుగు, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

ములుగు మున్సిపాలిటీలో పన్నులను అడ్డగోలుగా పెంచారంటూ బీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి పలువురు నాయకులు మద్దతు తెలిపారు. పెంచిన పన్నులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 48 గంటల నిరాహార దీక్షకు బీజేపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు.ఈ దీక్షకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎంపీ సీతారాం నాయక్‌తో పాటు బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు హాజరై మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పెంచిన పన్నుల వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెంచిన పన్నులను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. పన్నుల పెంపుపై ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు.



హనుమకొండలో విషాదం.. భవనం పైనుంచి పడి కూలీ మృతి

హనుమకొండ, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

హనుమకొండ నక్కలగుట్టలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ బ్యాంకు భవనంలో మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడి రవీందర్ రెడ్డి అనే కూలీ మృతి చెందారు.ధర్మసాగర్ మండలానికి చెందిన రవీందర్ రెడ్డి స్థానికంగా ఉన్న ఓ బ్యాంకు భవనంలో మరమ్మతు పనులు నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. భవనం పైనుంచి కిందపడటంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు, తోటి కార్మికులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన మృతి చెందారు.మృతుడు రవీందర్ రెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించేందుకు కూలీ పనులకు వెళ్లిన ఆయన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆయన స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



'అక్వాన్' తుఫాన్ ప్రభావం.. తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వర్షాలు!

హనుమకొండ, 17 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల):



బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' (Akvan) తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో ఈ నెల 20, 21 తేదీల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ (IMD) హెచ్చరించింది. పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.వాతావరణ శాఖ తాజా హెచ్చరికల ప్రకారం నవంబర్ 20న భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు భారీ నుంచి అతిభారీ వర్షాల నేపథ్యంలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ములుగు, నల్గొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది.అలాగే నవంబర్ 21న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది.తుఫాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలోనూ భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తుఫాన్ ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం నెల్లూరు నుంచి విశాఖపట్నం మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటించాలని, రైతులు, మత్స్యకారులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఆశ్రయం పొందవద్దని సూచిస్తున్నారు.

నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం.. ఈ నెల 20న హనుమకొండలో జాబ్ మేళా

హనుమకొండ, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):



నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉపాధి కల్పన శాఖ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు.ప్రముఖ సంస్థ పవర్‌లింక్ ఇన్‌ఫ్రాటెక్‌లో ఖాళీగా ఉన్న 30 సర్వీస్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి ఈ జాబ్ మేళా ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. పదో తరగతి నుంచి బీటెక్ వరకు విద్యార్హత కలిగి, 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులని అధికారులు తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 15 వేల వేతనంతో పాటు పీఎఫ్ (PF), ఈఎస్ఐ (ESI), ప్రయాణ భత్యం (TA), కరవు భత్యం (DA) వంటి అదనపు ప్రయోజనాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీన ఉదయం 10:30 గంటలకు ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలతో నేరుగా హాజరుకావాలని అధికారులు సూచించారు.మరిన్ని వివరాల కోసం 7893394393 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ముప్ప బిక్షపతి ఎన్నిక

సూర్యాపేట, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ముప్ప బిక్షపతి ఎన్నిక కావడం పట్ల పలువురు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు ముప్ప బిక్షపతిని హైదరాబాద్‌లో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ముప్ప బిక్షపతి నాయకత్వంలో రజక సంక్షేమ సంఘం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రజకుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంక్షేమ సంఘం రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు చిలకరాజు శ్రీను, రాష్ట్ర కమిటీ సభ్యులు జీడిమెట్ల రవి, రజక సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు గూడెపు దీప తదితరులు పాల్గొని నూతన రాష్ట్ర అధ్యక్షుడికి అభినందనలు తెలియజేశారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



మాట...!

అక్షరాలు రెండే అయినా..
నాలుగు అక్షరాల జీవితాన్ని ముందుకు నడిపించే శక్తి మాటకు ఉంది!
కడుపునిండా అన్నం పెట్టించేది మాటే..
అదే కడుపును ఖాళీ చేసేది కూడా మాటే!
ముఖంపై చిరునవ్వులు పూయించేది మాటే..
అదే ముఖాన్ని చింతలో ముంచేది కూడా మాటే!
యుద్ధం మొదలయ్యేలా చేసేది మాటే..
రాయబారిగా మారి యుద్ధాన్ని ఆపేది కూడా మాటే!
మమకారాన్ని చూపించే మాటే..
మూర్ఖత్వాన్ని బయటపెట్టే మాటగా కూడా మారుతుంది!
అక్కరకు రాని బంధువు కంటే..
అరక్షణం అవసరమైనప్పుడు పలికే మాటే గొప్పది!
ఎందుకంటే...
అమ్మ చెప్పిన మాటే కదా..
పంచ పాండవులకు ద్రౌపదిని భార్యగా చేసింది!
పొరపాటున పలికిన మాటే కదా..
మహాభారత యుద్ధానికి కారణమైంది!
మాటకు మనిషిని కలిపే శక్తి ఉంది..
మనుషుల మధ్య దూరాన్ని పెంచే శక్తి కూడా ఉంది!
అందుకే మాటను ఆచితూచి మాట్లాడాలి..
ఎందుకంటే పలికిన మాట వెనక్కి తీసుకోలేం!
మనిషి నిజ జీవితంలో నిలదొక్కుకోవడానికి మాట ఎంతో అవసరం..
కానీ ఆ మాటలో నిజాయితీ, ప్రేమ, గౌరవం ఉండాలి!
మాట చిన్నదే కావచ్చు..
కానీ దాని ప్రభావం జీవితకాలం ఉంటుంది!

నాగిల్ల రజినీకాంత్

ఈనెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

అర్హులైన ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలి.. డిసెంబర్ 20 వరకు గడువు

కుటుంబ పెద్ద మరణిస్తే రూ.5 లక్షల బీమా పరిహారం



సూర్యాపేట, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణించినప్పుడు ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఈనెల 19వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం ప్రారంభం కానుందని, జిల్లాలోని ప్రతి కుటుంబం ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.ఈ పథకం అమలుపై సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం అర్హతలు, దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియ, అధికారుల బాధ్యతలపై పలు సూచనలు చేశారు.

18 నుంచి 59 ఏళ్ల వయసున్న కుటుంబ పోషకులకు అర్హత

కుటుంబాన్ని పోషించే వ్యక్తి 18 నుంచి 59 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఆ వ్యక్తి మరణించినట్లయితే కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందుతుందని వివరించారు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉన్న కుటుంబాలతో పాటు రేషన్ కార్డు లేని కుటుంబాలకు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

ఎలాంటి ఫీజులు, ప్రీమియం అవసరం లేదు

ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి చార్జీలు, ఫీజులు లేదా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని తెలిపారు. వయస్సు ధ్రువీకరణకు ఆధార్ కార్డు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి బీమా పొందే వ్యక్తిగా, కుటుంబ సభ్యులు నామినీలుగా ఉంటారని వివరించారు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను పేర్కొనే అవకాశం ఉందని తెలిపారు.

గ్రామ, వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ

ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రానికి ఒక ఇన్‌చార్జిని నియమించాలని, మూడు నుంచి నాలుగు క్లస్టర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించి గ్రామాల వారీగా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఎంపీడీవోలు, ఎంఈఓలు, తహసీల్దార్లు, ఏఈపీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీవోలు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాలని తెలిపారు.రేషన్ కార్డు ఆధారంగా దరఖాస్తులో కుటుంబ వివరాలు ముందుగానే నమోదై ఉంటాయని, వాటిని జాగ్రత్తగా పరిశీలించి కుటుంబ పోషకుడు, నామినీ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. నామినీ మైనర్‌గా ఉన్నట్లయితే బీమా పొందే వ్యక్తి సమ్మతితో మరో వ్యక్తిని నామినీగా ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు.దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు జతచేయాలని, సంబంధిత పత్రాలను మొబైల్ యాప్ లేదా వెబ్ పోర్టల్ ద్వారా అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుల హార్డ్ కాపీలను ఎంపీడీవో కార్యాలయాల్లో భద్రపరచాలని ఆదేశించారు. దరఖాస్తుదారుల నుంచి ప్రత్యేక ఫొటోలు లేదా అదనపు డిక్లరేషన్లు తీసుకోవాల్సిన అవసరం లేదని, దరఖాస్తు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉంటే సరిపోతుందని స్పష్టం చేశారు.

ప్రతి కుటుంబానికి పథకంపై అవగాహన కల్పించాలి

జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రచారం చేపట్టి ప్రతి కుటుంబానికి సమాచారం చేరవేయాలని సూచించారు. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 20 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, మండల ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ స్వయంగా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఒకేసారి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జెడ్పీ సీఈఓ శిరీష, సీపీఓ కిషన్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా క్రీడల అధికారి వెంకట్ రెడ్డి, డీఎల్పీవో తదితరులు పాల్గొన్నారు.

పెద్దపెండ్యాలలో రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు



హనుమకొండ, నవంబర్ 17 (ప్రజానేస్తం జ్వాల):

ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామ అభివృద్ధికి రూ.8 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ఐకేపీ కేంద్రం, రూ.36 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించడంతో పాటు చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దపెండ్యాల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. నీతి, నిజాయితీతో ప్రజలకు సేవ చేయడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. గత పాలకులు అభివృద్ధిని పక్కనపెట్టి కమిషన్లకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు.బీఆర్ఎస్ పాలనలో అప్పులు, అవినీతి ఆరోపణలపై కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. కవిత చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ప్రజలకు వివరణ ఇవ్వాలని అన్నారు. దళితబంధు పథకం అమలు, పదవుల వినియోగం వంటి అంశాలపైనా ఆయన విమర్శలు చేశారు.గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు అవసరమైన మరిన్ని మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, చేయూత పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

అది అప్పుడూ ఉంది.. ఇప్పుడూ ఉంది: కాస్టింగ్ కౌచ్‌పై రమ్యకృష్ణ షాకింగ్ కామెంట్స్!



కాస్టింగ్ కౌచ్ వాస్తవమేనన్న సీనియర్ నటి రమ్యకృష్ణ
అది ఎప్పటికీ ఉంటుందని, ఎవరూ కాదనలేరని స్పష్టీకరణ
వేధింపులు సినీ పరిశ్రమకే పరిమితం కాదన్న నటి
గతంలో తాము పడిన కష్టాలను గుర్తుచేసుకున్న రమ్యకృష్ణ
నేటి నటీనటులు చాలా అదృష్టవంతులని వ్యాఖ్య

సినీ పరిశ్రమలో ఎప్పటినుంచో చర్చనీయాంశంగా ఉన్న 'కాస్టింగ్ కౌచ్'పై సీనియర్ నటి రమ్యకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. చిత్ర పరిశ్రమలో ఈ తరహా వేధింపులు అప్పుడూ ఉన్నాయని, ఇప్పుడూ ఉన్నాయని, భవిష్యత్తులో కూడా ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఈ దోపిడీ కేవలం ఒక పరిశ్రమకే పరిమితం కాదని, లింగ భేదం లేకుండా అన్ని రంగాల్లోనూ జరుగుతుందని అభిప్రాయపడ్డారు.ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. "అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశంలోనే ఎవ్‌స్టీన్ ఫైల్స్ లాంటివి బయటపడ్డాయి. అక్కడ మహిళలు ఎంతో ముందున్నా అలాంటివి ఎదుర్కోవాల్సి వచ్చింది. కాబట్టి ఇక్కడ జరగదని చెప్పలేం. ఇష్టంతోనో, బలవంతంగానో, మామూలుగానో.. అది జరుగుతూనే ఉంటుంది. దీన్ని ఎవరూ కాదనలేరు. మనది గ్లామర్ ప్రపంచం కాబట్టి దీని గురించి ఎక్కువగా మాట్లాడుకుంటారు. బయట కూడా ఎంతోమంది మహిళలు ఇలాంటివి ఎదుర్కొంటున్నారు" అని వివరించారు.గతంలో చిత్ర పరిశ్రమలో తాము ఎదుర్కొన్న కష్టాలను కూడా రమ్యకృష్ణ గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లో ఫిల్మ్ సెట్లలో కనీసం వాష్‌రూమ్‌లు, క్యారవాన్‌లు ఉండేవి కావని తెలిపారు. బట్టలు మార్చుకోవడానికి కూడా సరైన ప్రైవసీ ఉండేది కాదని, అంబాసిడర్ కార్లలో కూర్చుని బాటిళ్లలోనే మూత్ర విసర్జన చేసిన సందర్భాలున్నాయని చెప్పారు. ఆ కష్టాలతో పోలిస్తే ఇప్పటి నటీనటులు చాలా అదృష్టవంతులని, తాము పడిన కష్టాల్లో పావు వంతు కూడా వారు అనుభవించలేదని అన్నారు. ఇక, సినిమాల విషయానికొస్తే.. రమ్యకృష్ణ ఇటీవల రజినీకాంత్‌తో కలిసి 'జైలర్ 2'లో నటించారు. వీటితో పాటు 'రాకా', 'శ్రీ శ్రీ', 'పాకెట్ నావెల్', 'తేరా యార్ హూ మే' వంటి చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి.